# సింగిల్ పేజి కథలు

# అమాయకుడు

వేగంగా వెళ్తోంది రైలు.

భోజనాలు ముగించినవాళ్ళు అప్పుడే బెర్త్‌ల మీద పడకలు సర్దుకుంటున్నారు.

రాజేష్ ఎయిర్‌పిల్లోకి గాలి వూదాక, క్యాప్ పెట్టి టైట్ చేసాడు. బెడ్‌షీట్ సర్దుకుని 'ఇక పడుకుందాం' అనుకుంటూ వుంటే రైలు స్టేషన్‌లో ఆగింది.

అతడు కిటికీ తెరచి అటు చూస్తే 'తెనాలి' బోర్డ్ కనిపించింది. 'ట్రెయిన్ రైట్ టైమ్‌కే నడుస్తున్నట్టుంది' మనసులోనే అనుకుని, బెర్త్‌మీద నడుము వాల్చబోతుంటే, కంపార్ట్‌మెంట్‌లోకి ఎవరో వచ్చిన అలికిడయ్యింది. అతడు తలతిప్పి చూసాడు.

కళ్ళముందు ఓ మెరుపు మెరిసినట్టయ్యింది. దాంతో కొద్దిక్షణాలపాటు మెదడు పనిచేయకుండా పోయిన పరిస్థితి.

"కొద్దిగా జరుగుతారా?"

మృదుమధురమైన కంఠస్వరం తననే అడుగుతున్నట్టనిపించటంతో, అతడు ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. "సారీ" అంటూ అడ్డు తొలిగాడు.

ఆమె పక్కనే వున్న లోయర్‌బెర్త్ నంబర్ సరిచూసుకుని, తన లగేజీ సర్దుకుంటూ వుంటే అతడికీసారి గుండె ఆగి కొట్టుకున్నట్టయ్యింది "ఈ అందాలరాశి.. అపరంజిబొమ్మ.. ఈ రాత్రాంతా నాకు రెండడుగుల దూరంలో పక్క బెర్త్‌మీదే పడుకోబోతుందా?" గుండె కొట్టుకోవటం మొదలయ్యాక అతడు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

లగేజీ సర్దుకోవటం పూర్తయ్యాక ఆమె అతడి వైపు తిరిగి పలకరింపుగా నవ్వింది. "మీరూ హైదరాబాద్‌కేనా" అడిగింది.

ఆమె ఫ్రీగా మాట్లాడే కేరక్టర్ అని తెలియడంతోనే అతడి ఆనందం ఆశగా మారింది.

"ఆ..అవునండి" అన్నాడు. ఆశపడడమంటే, రైల్లోనే ఏదో జరిగిపోతుందని కాదు. జస్ట్.. ఆ పరిచయం, హైదరాబాద్ చేరుకున్నాక కంటిన్యూ అయితే, ఏమో ఏం జరుగుతుందో!

అప్పుడే ఆమె చెప్పింది "నేనూ హైదరాబాద్‌కే! మా నేటివ్ ప్లేస్ తెనాలి. నేను హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ చేస్తున్నాను."

ఆమె అంత క్లోజ్‌గా మాట్లాడుతుంటే తను ఓ అడుగు ముందుకేయొచ్చని అనిపించింది అతడికి "నా పేరు రాజేష్. మాది నెల్లూరు. నేను హైదరాబాద్‌లో ఓ సూపర్ మార్కెట్‌కి మేనేజర్‌గా వుంటున్నాను" చెయ్యి సాచి షేక్ హాండ్ చెయ్యాలనిపించింది. కానీ అంత ఫాస్ట్‌నెస్ వలన అసలుకే మోసం వస్తుందేమోననిపించి, ఆ పని చేయలేదు.

"నా పేరు జ్యోతి" నవ్వుతూ చెప్పిందామె. ఆ తర్వాత బెడ్ మీద పక్కకు సర్దుకుని పడుకుంటూ "గుడ్‌నైట్" అంది.



ఆమె అంత త్వరగా పడుకోవడం అతడికి ఇష్టం లేదు. 'మరికాసేపు ఇద్దరూ మాట్లాడుకుంటే, చనువు ఏర్పడుతుంది. ఒకరి గురించి మరొకరికి ఎక్కువగా తెలిసే అవకాశముంటుంది కదా' అనుకున్నాడు.

రాజేష్ ఆమెనే చూస్తున్నాడు.

కొద్ది నిముషాలలోనే ఆమె నిద్రలోకి జారుకుంది.

అతడికి మాత్రం నిద్రపట్టలేదు. ఆమె ఎప్పుడెప్పుడు మేలుకుంటుందా?- అన్నట్టు ఆశగా, ఆత్రంగా చూడసాగాడు.

ఓ గంట తర్వాత ఆమె హఠాత్తుగా లేచింది. పక్కనున్న వాటర్ బాటిల్ తీసుకుని నీళ్ళు తాగుతూ అతడికేసి చూసింది. కాస్త ఆశ్చర్యంగా "మీరింకా నిద్రపోలేదా?" ప్రశ్నించింది.

"నిద్రపట్టలేదు" అతడూ నవ్వాడు.

"ఎందుకని?"

ఆ ప్రశ్న తనకో అవకాశం కాని, ఆ ప్రశ్నకు జవాబు చెప్పాలంటే.. తనిప్పుడు కొంత రిస్క్ తీసుకోవలసి వుంటుంది. 'ధైర్యే సాహసే సాన్నిహిత్యం' ఎంతోకొంత ధైర్యం చేయలేకపోతే ఆమెతో సన్నిహితంగా వుండడం కష్టం.

అందుకే రిస్క్ అయినా ధైర్యం చేసాడు. "నిద్ర పట్టడం లేదెందుకంటే.. ఇంత.. ఇంత అందమైన అమ్మాయి ఎదురుగా వుంటే, ఏ కుర్రాడైనా ప్రశాంతంగా ఎలా నిద్రపోగలడు?"

మసక చీకటిలోనూ ఆమె ముఖంలో మార్పులు స్పష్టంగా కనిపించాయి. మొదట ఆమె ముఖంలో కంగారు, అంతలోనే ఏదో తెలియని ఆనందం.

చుట్టూ వున్న బెర్త్‌ల మీద జనం గాఢనిద్రలో వున్నారు.

ఆమె అటునిటు పరిశీలనగా చూసింది. ఆ తర్వాత ఒక్క అడుగు ముందుకేసింది.

ఏం జరిగిందో అర్థం చేసుకునే లోపే అతడి పెదవుల మీద ఏదో తడి! గుండె వేగం రెట్టింపయ్యింది. నరాలన్నీ పురిపెట్టి వదిలిన ఫీలింగ్.

ఆమె పెదవులు తన పెదవులను తాకాయని అర్థం చేసుకుని, రియాక్ట్ అయ్యేలోపే, ఆమె వెనుతిరిగి వెళ్ళి తన బెర్త్ మీద పడుకుంది.

రాజేష్‌కిక నిద్రపట్టలేదు. 'ఆమె తనకు ముద్దు పెట్టిందంటే, తనంటే ఆమెకు ఇష్టమున్నట్టే.. ఆమె ఎప్పుడు లేస్తుందా, తనను చేరి స్వర్గసుఖాలు అందిస్తుందా?' అని ఆమె వంకే చూడసాగాడు. ఆమె ఎంతకీ నిద్రలేవలేదు. అలాగని ఆమెకు దగ్గరగా వెళ్ళి ఏదో, ఏదేదో చేసేయడానికి అతడికి ధైర్యం సరిపోలేదు. ఎదురుగా మాట్లాడొచ్చు, చీకట్లో అటు వెళ్తే...?!

తెల్లారింది.

జ్యోతి నిద్ర లేచింది. అప్పుడే అతడిని చూసి పలకరింపుగా నవ్వింది.

అతడిలో ఇంకా ఆశ చావలేదు. "ఒకవేళ ట్రైన్‌లో తప్పు చేయటం రిస్క్ అనుకుందేమో! అందుకే ట్రైన్ దిగాక తనతో కలిసి వచ్చేయొచ్చు.." అతడి ఊహలు అనంతంగా సాగుతున్నాయి.

ట్రైన్ సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆగింది.

జ్యోతి కంపార్ట్‌మెంట్‌లో నుండి దిగి, ప్లాట్‌ఫారమ్ మీద నడుస్తుంటే వెనుకే అనుసరించి వచ్చిన రాజేష్ అన్నాడు. "హలో!... నేనంటే మీకిష్టమని రాత్రి మీరు ముద్దు పెట్టినప్పుడే తెలిసింది. మరిప్పుడు మనం ఎక్కడికెళ్దాం?"

ఆమె ఆగింది. అతడి ముఖంలోకి చూసింది; అదోలా నవ్వి అసలు విషయం చెప్పింది.

"చూడండి! నా మెడలో ఈ రవ్వల నెక్లెస్ వుంది. హేండ్‌బ్యాగ్‌లో పాతిక వేల క్యాష్ వుంది. కాబట్టి నిద్రపోవద్దని మావాళ్ళు గట్టిగా చెప్పి రైలెక్కించారు. కానీ నేనేమో నిద్ర ఆపుకోలేను. ఏం చేయాలా అని ఆలోచిస్తే అమాయకంగా నాకేసే చూస్తున్న మీరు కనిపించారు. మీకో ముద్దు పడేస్తే రాత్రంతా ఆబగా, ఆశగా నాకేసే చూస్తూ నిద్రమేల్కొంటారని తెలుసు. అందుకే నేను నిద్రపోవటం కోసం, మిమ్మల్ని నిద్రపోనివ్వకుండా నాకు కాపలాగా వుండడం కోసం మీకో ముద్దు పడేసా.. అర్థమయ్యిందిగా.. వస్తా.."

అందంగా నడుచుకుంటూ వెళ్తున్న ఆమెకేసి విస్తుపోయి చూస్తూండిపోయాడు అమాయకుడు రాజేష్.

-జె.సునీల్ (హైదరాబాద్)